aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
మంగళవారం
23-06-2026 సంపుటి : 01 సంచిక :92 పేజీలు : 08 వెల :₹ 5/-
Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

BESQATI
besqati.com
Contact : info@besqati.com

# లక్నోలో భారీ అగ్నిప్రమాదం

## మంటల తీవ్రతకు 14 మంది విద్యార్థులు మృతి

- బిల్డింగ్ పైనుంచి దూకిన పలువురు విద్యార్థులు
- రంగంలోకి 8 ఫైర్ ఇంజన్లు.. ముమ్మర సహాయక చర్యలు
- స్పందించిన సీఎం యోగి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
- ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి.. మృతులకు సంతాపం
- మృతుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- ఘటనపై సమగ్ర విచారణకు డీజీపీకి సీఎం ఆదేశం

లక్నో,జూన్ 22 (మహాప్రభ)

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి

-మిగతా 3 లో





### అమెరికాకు
# షాకిచ్చిన చైనా

- పది సైనిక కంపెనీలపై ఆంక్షలు
- సివిల్, మిలిటరీ వస్తువుల ఎగుమతిపై నిషేధం
- 46 అమెరికా సంస్థల కొనుగోళ్లకు బ్రేక్
- థర్డ్ పార్టీ బదిలీలపై చైనా ఆంక్షలు
- చైనా టెక్ కంపెనీలపై అమెరికా గురి
- ట్రంప్, జిన్‌పింగ్ చర్చల వృథా
- ఇరు దేశాల మధ్య ముదిరిన వాణిజ్య యుద్ధం

బీజింగ్, ,జూన్ 22 (మహాప్రభ)

అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు

-మిగతా 3 లో

### ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి
# సహకరిస్తాం

## కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ

- భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు తదితర అంశాలపై చర్చ
- ఎమ్ఆర్వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేయాలని వినతి
- ‘గాంధీ సరోవర్ ప్రాజెక్టు’ నిర్మాణానికి సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు



3





### ఓట్, సీట్ చోరీలో
# బిజెపి నిమగ్నం

- సర్వే ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయం: మహేష్ కుమార్ గౌడ్
- బీఆర్ఎస్ పదేళ్ల దోపిడీని ప్రజలు మర్చిపోలేదు
- కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ ఆగ్రహం
- బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణలో పాల్గొన్న మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్

హనుమకొండ,జూన్ 22 (మహాప్రభ)

సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని

-మిగతా 3 లో

# ఖతార్ గ్యాస్ ప్లాంట్‌లో పేలుడు..

- 12 మంది భారతీయులు మృతి



3



### బ్రిటన్ ప్రధాని కీర్
# స్టార్మర్ రాజీనామా

- లేబర్ పార్టీ ఒత్తిడితోనే పదవి నుంచి విముఖత
- పదేళ్లలో ఆరుగురు ప్రధానుల రాజీనామా
- ఎన్నికల వైఫల్యాలే కారణమన్న విశ్లేషకులు
- రాయబారి నియామక వివాదంపై పెరిగిన వ్యతిరేకత
- వలసల విధానం వల్లేనన్న డోనాల్డ్ ట్రంప్
- సొంత పార్టీ ఎంపీల ఒత్తిడికి లొంగిన స్టార్మర్

లండన్,జూన్ 22 (మహాప్రభ)

బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో

-మిగతా 3 లో

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం



- భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- నీటి హక్కుల కోసం ఏ స్థాయికైనా వెళ్తామని ప్రకటన
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు

ఇస్లామాబాద్,జూన్ 22 (మహాప్రభ)

సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు.

-మిగతా 3 లో

### వేధించినోళ్లకు..
# చుక్కలే

## రిటైర్ అయినా వదిలిపెట్టం

- కార్యకర్త గౌరవమే పార్టీ గౌరవం
- అన్ని వర్గాలను వంచించిన కాంగ్రెస్
- రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్ కార్యకర్తలపై వేధింపులు, అక్రమ కేసులు పెడితే సహించబోమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, పార్టీ శ్రేణుల ఆత్మగౌరవం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమై ప్రజలను మోసం చేసిందని తీవ్రంగా విమర్శించారు.

వరంగల్, జూన్ 22 (మహాప్రభ)

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన, వేధించిన ఒక్కొక్కడిని రిటైర్ అయినా, పారిపోయినా, సప్త సముద్రాలు దాటినా లాక్కొచ్చి చుక్కలు చూపెడతామని అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు హెచ్చరించారు. తెలంగాణ ప్రజల కోసం, పార్టీ కార్యకర్తల కోసం అండగా నిలుస్తూ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు భరోసా కల్పించేలా కేటీఆర్ ఘాటుగా స్పందించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం బూత్ లెవెల్ కన్వీనర్ల

-మిగతా 3 లో






### 2047 నాటికి2.4 ట్రిలియన్ల
# ఆర్థిక వ్యవస్థగా ఏపీ

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టియే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం వాటాతో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్
- రూ. 60,000 కోట్లతో అమరావతి నిర్మాణం..
- ఏపీలో మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లు: విశాఖ, అమరావతి, రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక
- ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి

న్యూఢిల్లీ జూన్ 22 (మహాప్రభ)

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

-మిగతా 3 లో



### మమతకు
# ఊహించని షాక్..

- టీఎంసీ అధ్యక్ష పదవి దూరం
- కొత్త బాస్‌గా సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్
- అభిషేక్ బెనర్జీపై వేటు: సెక్రటరీ పదవి నుంచి తొలగింపు
- రిటాబ్రతా బెనర్జీ నేతృత్వంలో తిరుగుబాటు
- మూడు దశాబ్దాల పట్టు కోల్పోయిన దీదీ

న్యూఢిల్లీ జూన్ 22 (మహాప్రభ)

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వరసగా షాక్‌లు తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో మొదలు.. రెబెల్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులతో సతమతమవుతున్న మమత ఈసారి ఏకంగా పార్టీ అధ్యక్షురాలి పదవిని కోల్పోయింది. రెబెల్ ఎమ్మెల్యే వర్గం ఆమెను టీఎంసీ అధినేత్రిగా తొలగించింది. మమత స్థానంలో టీఎంసీ నాయకుడిగా సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్ ఎంపికయ్యాడు. అంతేకాదు పలువురు సన్నిహితులు సైతం మమతకు దూరమయ్యారు.

-మిగతా 3 లో

## సభలో 'డీకే-డీకే' నినాదాలు.. కాంగ్రెస్ కార్యకర్తలపై మండిపడ్డ ఖర్గే



**బెంగళూరు జూన్ 22 (మహాప్రభ)**
కాంగ్రెస్ కార్యకర్తలపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. సభలో 'డీకే-డీకే' అని నినాదాలు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. 'నోరు మూసుకోండి, పనికిమాలిన వాళ్లు' అని మందలించారు. ఆదివారం కర్ణాటక కాంగ్రెస్ కొత్త రాష్ట్ర అధ్యక్షుడిగా బీకే హరిప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు మద్దతుగా కార్యకర్తలు పైకి లేచి 'డీకే-డీకే' అని నినాదాలు చేశారు.కాగా, మల్లికార్జున్ ఖర్గే దీనిపై తీవ్ర అసహనానికి గురయ్యారు. ఇది పార్టీ కార్యక్రమం అని, ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినది కాదని వారికి గుర్తు చేశారు. 'నోరు మూసుకొని కూర్చోండి. దేశమంతా మీ చేతుల్లోనే ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారు. పనికిమాలిన వాళ్లు' అని ఆయన మండిపడ్డారు. 'గుర్తుంచుకోండి.. పార్టీకి క్రమశిక్షణ ఎప్పుడూ అవసరం. ఇక్కడ ఎవరైతే అరుస్తున్నారో, వారి దృశ్యాలు రికార్డవుతాయి. వాటిని పరిశీలించిన తర్వాత నేను క్రమశిక్షణా చర్యలు తీసుకుంటా' అని అన్నారు. మరోవైపు ఖర్గే వ్యాఖ్యల నేపథ్యంలో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సీఎం డీకే శివకుమార్ పార్టీ కార్యకర్తలను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఆయన పైకి లేచి నిశ్శబ్దంగా కూర్చోవాలని కార్యకర్తలకు సైగ చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## మా ఉత్పత్తులు కొంటే విదేశాల్లోని ఇరాన్ ఆస్తులు విడిపిస్తాం



**న్యూఢిల్లీ జూన్ 22 (మహాప్రభ)**
పశ్చిమాసియా లో శాశ్వత శాంతి స్థాపన దిశగా మరో ముందడుగు పడిందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. రెండు దేశాల మధ్య యుద్ధానికి శాశ్వత ముగింపు పలుకడమే లక్ష్యంగా ఆ దేశంతో జరిపిన చర్చలు తుది ఒప్పందానికి మంచి పునాది వేశాయని చెప్పారు. దీనివల్ల అమెరికా ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తమ సోయా, మొక్కజొన్న, గోధుమలను టెహ్రాన్ కొనుగోలు చేస్తే దానికి బదులుగా విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు విడిపిస్తామని పేర్కొన్నారు.తాము చేసుకున్న ప్రాథమిక ఒప్పందానికి ఇరాన్ కట్టుబడి ఉందో లేదో ధ్రువీకరించడానికి ఐక్యరాజ్యసమితి అణు తనిఖీ అధికారులు ఇరాన్‌ను సందర్శిస్తారని వాన్స్ తెలిపారు. లెబనాన్ విషయంలో సరైన సమన్వయం ఉండేలా ఇరాన్, ఇజ్రాయెల్ నేతలతో తమ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. హర్మూజ్ తెరిచే ఉందని, జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని అన్నారు. పాక్ మధ్యవర్తిత్వంతో ఇరుదేశాలు అవగాహన ఒప్పందంలో ముందడుగు వేశాయని ఇరాన్ అధికారులు వెల్లడించారు. పాక్ నేతలు లేకపోతే ఒప్పందం ముందుకు సాగడం కష్టతరంగా మారేదని, మళ్లీ ఘర్షణలు తలెత్తేవని పేర్కొన్నారు. రాబోయే 60 రోజుల్లో ఒక సమగ్ర ఒప్పందానికి ఎలా చేరుకోవాలనే దానిపై చర్చలు కొనసాగుతున్నాయన్నారు. చర్చల ద్వారానే దౌత్యపరమైన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

## మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం

**ఆరుగురు ఉద్ధవ్ ఎంపీలు శిందే వర్గంలో చేరిక**



**ముంబయి, జూన్ 22 (మహాప్రభ)**
మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ)కు చెందిన ఆరుగురు ఎంపీలు శిందే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో గడిచిన కొన్ని రోజులుగా శివసేన (యూబీటీ)లో చీలికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. 'ఆరు పులులు (ఎంపీలనుద్దేశించి) ఇప్పుడు అసలైన శివసేన ఫ్యామిలీలోకి వచ్చాయి. వారికి స్వాగతం. ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది' అని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే ప్రకటించారు. శిందే క్యాంప్‌లో చేరిన ఎంపీల్లో ఓం రాజే నింబాల్కర్, సంజయ్ దిన పాటిల్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, నగేష్ పాటిల్ అష్టికర్, బౌసాహెబ్ వక్చౌరే ఉన్నారు. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు శిందే క్యాంప్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల క్రితం 2022 జూన్ 22న 40 మంది ఎమ్మెల్యేలు తమతో వచ్చారన్న శిందే.. ఇప్పుడు ఏకంగా 'సిక్స్' కొట్టామని పేర్కొన్నారు. శివసేన రెండో విడత విస్తరణ ప్రణాళికగా ఈ చేరికను అభివర్ణించారు. మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల ఢిల్లీలో పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయగా.. కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో శివసేనలో మరోసారి చీలిక ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా అధికార, విపక్ష కూటముల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ తాజాగా ఆరుగురు ఎంపీలు శిందే క్యాంప్‌లో ప్రత్యక్షమయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అందడం లేదన్న కారణంతోనే తాము పార్టీ మారుతున్నట్లు రెబల్ ఎంపీలు చెప్పుకొచ్చారు.

## భవిష్యత్తులో భారతీయులు ఎక్కువగా ఖర్చు చేసేది వీటి కోసమే..!

**న్యూఢిల్లీ జూన్ 22 (మహాప్రభ)**
ఒకప్పుడు కొత్త ఫోన్, టీవీ, ఫర్నీచర్ కొనడం అనేవి ముఖ్యమైన విషయాలు. ఇప్పుడు మాత్రం చాలామంది డబ్బును వస్తువుల కంటే అనుభవాల కోసం ఖర్చు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రయాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. రాబోయే ఐదేళ్లలో ఈ ధోరణి మరింత బలపడనుందని రియల్ ఎస్టేట్ సేవలు, పెట్టుబడుల సంస్థ సీబీఆర్ఈ రిసెర్చ్ అధ్యయనం చెబుతోంది. 2030 నాటికి భారతీయులు వస్తువుల కంటే అనుభవాలపైనే ఎక్కువగా ఖర్చు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నది.ఈ నివేదిక ప్రకారం.. 2025-2030 మధ్య కాలంలో భారతీయుల అనుభవాలపై (ఎక్స్‌పీరియెన్సెస్) ఖర్చు వేగంగా పెరగనుంది. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, పర్యటనలపై వ్యయం వార్షికంగా 10.3 శాతం వృద్ధి రేటుతో




పెరుగుతుందని అంచనా వేసింది. ఇక భౌతిక వస్తువులపై ఖర్చు 9.1 శాతం వృద్ధి రేటుతో పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా హోటల్ వసతి ఖర్చులు 10.6 శాతం వృద్ధితో మరింత వేగంగా పెరుగుతాయని నివేదిక పేర్కొన్నది. ఈ మార్పునకు ప్రధాన కారణం జెన్‌జీ తరమేనని నివేదిక వెల్లడించింది. సోషల్ మీడియాలో పంచుకునేలా ప్రత్యేక అనుభవాలు, ఆకర్షణీయమైన ప్రదేశాలు, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే హోటళ్లకు యువత ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణ వసతి కంటే ప్రత్యేక అనుభూతిని అందించే లైఫ్‌స్టైల్ హోటళ్లకు డిమాండ్ పెరుగుతోంది. వైన్ టేస్టింగ్, సంగీత కార్యక్రమాలు, స్థానిక కళా ప్రదర్శనల వంటి కార్యక్రమాలు నిర్వహించే హోటళ్లను యువ పర్యాటకులు ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 2015 నుంచి 2025 మధ్య మొత్తం హోటళ్ల సంఖ్య 5 శాతం వృద్ధిరేటుతో పెరిగితే, లైఫ్‌స్టైల్ హోటళ్లు 19 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2030 వరకు కూడా ఈ విభాగం వేగంగా విస్తరించే అవకాశముందని నివేదిక తెలిపింది. భారత్‌లో ఈ తరహా హోటళ్ల సంఖ్య ఇంకా తక్కువగానే ఉండటంతో పెట్టుబడిదారులు, డెవలపర్లకు విస్తృత అవకాశాలు ఉన్నాయని విశ్లేషించింది. ఇప్పటికే ఉన్న హోటళ్లను ఆధునిక లైఫ్‌స్టైల్ హోటళ్లుగా మార్చే ధోరణి కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నది.

## నటుడు ప్రకాష్‌రాజ్‌కు నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్

- ఒకే వ్యక్తికి నాలుగు ఓటరు కార్డులు
- ప్రజాప్రాతినిధ్య చట్టం ఉల్లంఘనపై కోర్టుకు
- సమన్లు బేఖాతరు చేయడంపై న్యాయస్థానం ఆగ్రహం
- నటుడి అరెస్టుకు పోలీసుల రంగసిద్ధం

**న్యూఢిల్లీ జూన్ 22 (మహాప్రభ)**
ప్రముఖ బహుభాషా నటుడు, సామాజిక రాజకీయ విమర్శకుడు ప్రకాష్‌రాజ్ చుట్టూ వివాదం నెలకొన్నది. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు ఉండకూడదనే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే కేసులో ఆయనకు గట్టి షాక్ తగిలింది. బెంగళూరు లోని 48వ ఏసీజేఎం కోర్టు శనివారం ప్రకాష్‌రాజ్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేస్తూ సంచలన ఆదేశాలు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... ప్రకాష్‌రాజ్‌కు ఒకే సమయంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరు గుర్తింపు కార్డులు



ఉన్నాయంటూ 2019లో దిలీప్ కుమార్ అనే న్యాయవాది బెంగళూరు హలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో తొలిసారి ఫిర్యాదు చేశారు.కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయనకు ఓటు హక్కు ఉందని, ఇది ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చట్టవిరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ అక్రమ ఓట్ల వ్యవహారంపై బృహత్ బెంగళూరు మహానగర పాలిక అధికారులకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సదరు న్యాయవాది ఏకంగా కోర్టును ఆశ్రయించారు. ఈ ప్రైవేట్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం గత కొన్ని విచారణలుగా కోర్టుకు స్వయంగా హాజరుకావాలంటూ ప్రకాష్‌రాజ్‌కు సమన్లు జారీచేసింది. అయితే కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రకాష్‌రాజ్ వరుసగా కోర్టు విచారణలకు గైర్హాజరవుతూ వచ్చారు. కోర్టు సమన్‌లు లైట్ తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. ఈసారి ఆయనకు ఎలాంటి బెయిల్ దొరకకుండా నేరుగా నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇష్యూ చేశారు. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## భారత్ నుంచి బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేయనున్న యూఏఈ..!


**న్యూఢిల్లీ జూన్ 22 (మహాప్రభ)**
భారత దేశం తన ప్రతిష్ఠాత్మక బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణి ఆకాశ్‌తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కి విక్రయించే దిశగా చర్చలు జరుపుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తమ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు యూఏఈ ఆసక్తి కనబరుస్తున్న తరుణంలో ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాయిటర్స్ మీడియా సంస్థ కథనం ప్రకారం.. ఈ చర్చలు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నప్పటికీ వేగంగా ముందుకు సాగుతున్నాయి. భారత్-రష్యాల సంయుక్త భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన బ్రహ్మోస్, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన క్రూయిజ్ క్షిపణులలో ఒకటిగా గుర్తింపు పొందింది.శబ్దవేగం కంటే మూడు రెట్లు వేగంతో (మాక్ 3) ప్రయాణించగల ఈ క్షిపణిని భూమి, సముద్రం,



గగనతలం నుంచి ప్రయోగించవచ్చు. దీని పరిధి సుమారు 290 కిలోమీటర్లు. ఇక భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన 'ఆకాశ్‌తీర్', గగనతలం నుంచి ఎదురయ్యే ముప్పులను వేగంగా పసిగట్టి స్పందించే అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ వ్యవస్థ. సాంప్రదాయకంగా అమెరికా వంటి పాశ్చాత్య దేశాల నుంచి ఆయుధాలను కొనుగోలు చేసే యూఏఈ, ఇప్పుడు తన రక్షణ అవసరాల కోసం ఇతర దేశాల వైపు కూడా దృష్టి సారిస్తోంది. యూఏఈ వద్ద ఇప్పటికే అమెరికా తయారీ థాడ్, పేట్రియాట్ వంటి శక్తివంతమైన రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. వీటికి అదనంగా ఆకాశ్‌తీర్ వ్యవస్థను జోడించడం ద్వారా తమ కమాండ్ అండ్ కంట్రోల్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బ్రహ్మోస్ జాయింట్ వెంచర్‌లో రష్యా భాగస్వామిగా ఉన్నందున ఈ విక్రయానికి మాస్కో ఆమోదం తప్పనిసరి. అయితే రష్యా-యూఏఈ మధ్య ఉన్న సత్సంబంధాల దృష్ట్యా ఇది అడ్డంకి కాకపోవచ్చని తెలుస్తోంది. ఈ చర్చలు భారత్-యూఏఈ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## ఏనుగు పేడతో కాఫీ.. ఎంత ఖరీదో తెలుసా.?

**న్యూఢిల్లీ జూన్ 22 (మహాప్రభ)**
కాఫీ అంటే దాదాపు అందరికీ ఇష్టం. ఉదయం ఓ కప్పు కాఫీ తో రోజును ప్రారంభించే వాళ్లు కోట్లలో ఉంటారు. కానీ ఏనుగు పేడ నుంచి సేకరించిన గింజలతో తయారు చేసిన కాఫీ గురించి చాలా మందికి తెలిసి ఉండదు. ఈ ఏనుగు పేడలోని గింజలతో తయారుచేసిన కాఫీ విలువ కూడా మామూలుగా ఉండదట. ఒక కప్పు కాఫీ ధర ఏకంగా రూ.4,700 ఉంటుందట. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇదే ప్రపంచంలో అత్యంత అరుదైన, ఖరీదైన కాఫీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.థాయ్‌లాండ్‌లో తయారయ్యే 'బ్లాక్ ఐవరీ కాఫీ' ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ రకాలలో ఒకటి. దీని ధర కిలోకు దాదాపు 2,000 డాలర్ల వరకు ఉంటుంది. కానీ ఈ ఏనుగు పేడలోని గింజలతో తయారయ్యే ఒక్క కప్పు కాఫీ ధరే సుమారు 50 డాలర్లు.. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.4,700 కు పైమాటే. ఈ కాఫీ ప్రత్యేకత ఏంటంటే గింజలను ఏనుగుల జీర్ణవ్యవస్థ ద్వారా ప్రాసెస్ చేస్తారు. కాఫీ గింజలను బియ్యం, అరటిపండ్లు, ఇతర పండ్లతో కలిపి ఏనుగులకు ఆహారంగా ఇస్తారు. ఆహారం జీర్ణమయ్యే సమయంలో



కాఫీ గింజలు కూడా ప్రత్యేక ప్రక్రియకు లోనవుతాయి. 15 నుంచి 17 గంటల తర్వాత ఏనుగుల మల విసర్జన నుంచి ఆ గింజలను సేకరించి శుభ్రపరుస్తారు. అనంతరం వాటిని ప్రాసెస్ చేసి కాఫీ తయారు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల కాఫీకి ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తుందని కాఫీ ప్రియులు చెబుతున్నారు. ఈ కాఫీ తయారీ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతుంది. గింజల సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలో అధిక శ్రమ అవసరం. అలాగే ఉత్పత్తి పరిమితంగా ఉండటం కూడా ధర పెరగడానికి కారణం. కాఫీలో చాక్లెట్, నట్స్, మట్టి వాసనల మిశ్రమ రుచి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# లక్నోలో భారీ అగ్నిప్రమాదం

మొదటి తరువాయి

ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఎనిమిద్గి ÷రిరజన్లతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదిక అందించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# అమెరికాకు షాకిచ్చిన చైనా

మొదటి తరువాయి

చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

మొదటి తరువాయి

బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ÷ుసబీపూ) ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

# ఖతార్ గ్యాస్ ప్లాంట్‌లో పేలుడు..

## -12 మంది భారతీయులు మృతి



దోహా

ఖతార్‌లోని ప్రముఖ రాస్ లఫాన్ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్(ఎల్ఎన్‌సీ) పరిశ్రమలో సంభవించిన భారీ పేలుడులో 13 మంది మృతిచెందగా, మరో 66 మంది గాయపడ్డారు. మృతుల్లో 12 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇరాన్ జరిపిన క్షిపణి దాడి కారణంగా నిలిచిపోయిన కార్యకలాపాలను కార్మికులు పునరుద్ధరిస్తున్న సమయంలో ఈ పేలుడు చోటుచేసుకుంది. 'బర్జాన్' గ్యాస్ సరఫరా విభాగంలో ఈ ప్రమాదం జరిగిందని, ఇది ఒక సాంకేతిక ప్రమాదం అని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దోహాలోని భారత రాయబార కార్యాలయం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడగా, మరికొందరు అదృశ్యమయ్యారని పేర్కొన్నది. కాగా ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌కు 70 కిలోమీటర్ల దూరంలోని సెంట్రల్ దోహాలో ఈ పేలుడు ధాటికి కిటికీలు కంపించాయని, స్థానికులు భయాందోళనలకు గురయ్యారని సమాచారం. ఈ ప్రమాదం కారణంగా ఖతార్ ఎల్ఎన్‌సీ ఎగుమతి సామర్థ్యానికి ఎలాంటి ఆటంకం లేదని, పర్యావరణానికి ఎటువంటి హాని జరుగలేదని ఖతార్ ఇంధన మంత్రిత్వశాఖ తెలిపింది.

## 2047 నాటికి2.4 ట్రిలియన్ల

# ఆర్థిక వ్యవస్థగా ఏపీ

మొదటి తరువాయి

తృణమూల్ కాంగ్రెస్‌పై మమతా బెనర్జీ పట్టు కోల్పోయింది. 1998లో టీఎంసీని స్థాపించి మూడు దశాబ్దాలుగా పశ్చిమ బెంగాల్‌లో చక్రం తిప్పిన మమత.. అనూహ్యంగా పార్టీ చైర్ పర్సన్ పదవికి దూరమయ్యారు. రిటాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని రెబెల్ ఎమ్మెల్యేలు మమతను తమ బాస్‌గా నిరాకరించారు. సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ని టీఎంసీ కొత్త నాయకుడిగా ఎన్నుకున్నారు. అంతేకాదు.. తమదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని రిటాబత్రా వర్గం ప్రకటించింది. అంతటితో సరిపెట్టకుండా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీని పార్టీ జాతీయ జనరల్ సెక్రటరీగా తప్పించారు. స్థానిక న్యూ టౌన్‌లోని హోటల్‌లో పార్టీ కౌన్సిలర్లతో సమావేశమైన రిటాబత్రా బెనర్జీ.. పార్టీలో ఐదేళ్ల అనంతరం సంస్థాగత మార్పులు జరగలేదని, అందుకే రాజ్యాంగబద్ధంగా తాము జాతీయ నాయకత్వాన్ని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మమతను తృణమూల్ కాంగ్రెస్ చైర్ పర్సన్‌గా తొలగిస్తూ.. హౌరా సెంట్రల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అరూప్ రాయ్‌కు పగ్గాలు అప్పగించారు. అయితే.. మమత సన్నిహితులు కొందరు మాత్రం ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక కామెడీ షోగా అభివర్ణించారు.

# ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

మొదటి తరువాయి

దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళ్తున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సహకరిస్తాం

మొదటి తరువాయి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి,

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటిగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి సీఎం స్పష్టం చేశారు. . భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు



ప్రయాణీకుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు కార్గో, ఎమ్ఆర్వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు . ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్లను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూల సీఎం విజ్ఞప్తి చేశారు . తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో, డీఆర్డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే లంగర్ హౌస్ బాపూ ఘాట్ సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు' నిర్మాణానికి అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డి ఆర్ డి ఓ / డి ఆర్ డి ఎల్ సంస్థలు ఎంచుకున్న స్థలంలో డిఫెన్స్ ఫెసిలిటీ (కీలక రక్షణ ప్రాజెక్టు) ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని రక్షణ మంత్రిని విజ్ఞప్తి చేశారు.

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

మొదటి తరువాయి

భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ÷ుగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

# వేధించినోళ్లకు.. చుక్కలే

మొదటి తరువాయి

సమావేశం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇదే వరంగల్ వేదికగా రైతు గర్జన పేరుతో ఢిల్లీ పెద్దలను పిలిపించి సభ పెట్టి రైతులకు ఎకరానికి 6000 రైతుబంధు, పంటకు గిట్టుబాటు ధరలతో పాటు బోనస్‌గా 500 రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు మూడు నెలలు అమలు చేస్తామని అన్ని వర్గాల ప్రజలను వంచించారని కేటీఆర్ విమర్శించారు. మహిళలకు స్కూటీలు ఇస్తామన్నారు.. రైతు కూలీలకు భరోసా ఇస్తామన్నారు.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను 13 డిక్లరేషన్ సభలు పెట్టి మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో అన్ని రాష్ట్రాలు కాంగ్రెస్‌ను వదిలించుకున్నాయి. కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నాయి. మరో ఏడాదిన్నరలో వచ్చేది కేసీఆర్ నాయకత్వంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, కార్యకర్తల ఆత్మగౌరవాన్ని రక్షించేందుకు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్యకర్తే పార్టీకి వెన్నెముక

కార్యకర్త గౌరవమే బీఆర్ఎస్ గౌరవం అని అన్నారు. హాస్టల్లో రాష్ట్రంలో ఏ మూలకు పోయినా కాంగ్రెస్ పాలన పోవాలి కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని బూత్ లెవెల్ కన్వీనర్లు బాధ్యతగా తీసుకొని సర్‌ను జాగ్రత్తగా పరిశీలించి మన ఓట్లు పోకుండా చూసుకోవాలన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గం బూత్ లెవెల్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, వెంకటరమణారెడ్డి, కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, రైతు రుణముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు రైతుబంధు వరంగల్ జిల్లా మాజీ కన్వీనర్ లలిత యాదవ్, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# 2047 నాటికి2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం.

గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు. రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## దేవరకొండ పట్టణంలో హనుమాన్ నగర్ కి చెందిన గోలి హరి గారి మృతి చాల బాధాకరం

**దేవరకొండ డివిజన్ జూలై 22( మహాప్రభ )**
దేవరకొండ పట్ట ణం లో హనుమాన్ నగర్ కి చెందిన గోలి హరి గారి మృతి చెందిన వార్త తెలుసుకున్న స్థానికంగా నివాళ్లర్పించారు .అనంతరం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి మనో ధైర్యాన్ని ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న. కౌన్సిలర్ ముత్యాల రవికుమార్ యాదవ్ కౌన్సిలర్ హనుమంతు సాయిచంద్ర గౌడ్ కౌన్సిలర్ గుండాల వెంకట్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య...

**పాపన్నపేట జూన్ 22( మహా ప్రభ )**
ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట శివారులో జరిగింది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా...మండల పరిధి సోమ్లా తండాకు చెందిన బానోవత్ రాంసింగ్(78) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు.ఇతని చిన్న కూతురు రేణుకను టెక్మాల్ మండలం ముత్యాల బంధం తండాకు చెందిన నరేష్ కి ఇచ్చి పెళ్లి జరిపించారు.కొన్ని రోజులుగా కూతురు, అల్లుడు మధ్య సంసార విషయాల్లో గొడవలు చోటు చేసుకుంటున్నాయి.మళ్లీ గొడవ జరగడంతో రేణుక పుట్టింటికి వచ్చింది.ఆదివారం పాపన్నపేటలో అందరి సమక్షంలో రేణుకకు సముదాయించి ఆమె భర్త వద్దకు పంపేందుకు ప్రయత్నించగా రేణుకా అక్కడికి వెళ్ళేందుకు నిరాకరించింది.మనస్థాపం చెందిన రాంసింగ్ ఆదివారం రాత్రి సమయంలో పాపన్నపేట గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించి మృతుడి భార్య మీరి ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.




## మల్కాపూర్‌లో ప్రీ-ప్రైమరీ పాఠశాల ప్రారంభం





**తూప్రాన్, జూన్ 22 (మహాప్రభ)**
తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రీ-ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ సత్యనారాయణతో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచే వినూత్న బోధనా విధానాలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమని పేర్కొన్నారు. గ్రామానికి మంజూరైన ప్రీ-ప్రైమరీ పాఠశాల సౌకర్యాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల తరగతి గదుల పెయింటింగ్, చిత్రలేఖనం, ఆట వస్తువుల కొనుగోలు కోసం ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసిందని, త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. చిన్నారులకు అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్‌రావు, యాదగిరి, ఉప సర్పంచ్ స్వామి, ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీలత, వార్డు సభ్యురాలు రేఖ, మేక్ ఇన్ యువత సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత..



**కల్వకుర్తి, జూన్ 22 (మహాప్రభ)**
కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్ర గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి రాములు కు సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును తాండ్ర మాజీ సర్పంచ్ గోలి కమలమ్మ చేతులమీదుగా ఆ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర ఎండోమెంట్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా వనం సుజాత

- దేవరకొండలో ఘన సన్మానం, మొక్కల పెంపకం



**దేవరకొండ జూన్ 22( మహా ప్రభ)**
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ (ధార్మిక) జాయింట్ కన్వీనర్ గా నూతనంగా నియమితులైన శ్రీమతి వనం సుజాత కు అభినందనలు తెలియజేస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమం సోమవారం ఉదయం 8:00 గంటలకు దేవరకొండ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు వస్కుల సుధాకర్, సీనియర్ నాయకులు శ్రీ అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు బిజెపి రాష్ట్ర నాయకులు లాలు నాయక్, విశ్వహిందూ పరిషత్ లింగయ్య, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, నేతాల వెంకటేశ్, నేనవత్ దేవుడు, గంప శశి, నాగేంద్ర, సుమన్, మోహన్, అలివేలు, చంద్రకళ, ముత్తమ్మ, మహేష్ మరియు నాయకులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అంతేకాకుండా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం మార్కెట్ యార్డ్ లో దేవస్థానం అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ ఆలంపల్లి నరసింహ, గీతా సత్సంగ సమితి అధ్యక్షులు నీల పాండవయ్య , బెజవాడ నరేందర్, కృష్ణమూర్తి అయ్యగారు మరియు బంధుమిత్రులు పాల్గొని సన్మానించారు. సీనియర్ నాయకులు నక్క వెంకటేశ్వర్లు, లాలు నాయక్ మాట్లాడుతూ దేశాన్ని మరియు పార్టీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడానికి పనిచేయాలని ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని శిథిలావస్థలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని హిందూ ధర్మం అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు ధార్మిక సెల్ ద్వారా పనిచేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ప్రధానమంత్రిగా సేవలందించిన గౌరవనీయులైన నరేంద్ర మోదీ గారి స్ఫూర్తితో "అమ్మ పేరుతో మొక్క" కార్యక్రమంలో భాగంగా బిజెపి తెలంగాణ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ శ్రీమతి వనం సుజాత మరియు ముఖ్య నాయకులు గీత సత్సంగ సమితి సభ్యులు కలిసి దేవాలయం ప్రాంగణంలో మామిడి, రుద్రాక్ష, కొబ్బరి, మోదుగ, అంజీర, అల్లనేరేడు, ఉసిరి, మరియు వివిధ రకాల పుష్పాలకు సంబంధించిన మొక్కలు నాటారు.
ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు మరియు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# మత్తు వద్దు నాన్న... జీవితాలు చిత్తుఅవుతాయి కన్నా






-మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుండాలి
-ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్

**పాపన్నపేట జూన్22( మహాప్రభ )**
మాదక ద్రవ్యాలు,మత్తు క్షణిక ఆనందాన్ని ఇచ్చినా, జీవితాలను చిత్తు చేస్తుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగాఉంటూఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవితాన్నిగడపాలని పాపన్నపేట ఎస్ఐశ్రీనివాస్ గౌడ్ పిలుపు నిచ్చారు. సోమవారం పాపన్నపేట జూనియర్ కళాశాలలో స్థానిక తహసీల్దార్ సతీష్ తో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహనసదస్సునిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల బారిన పడితే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాలవినియోగాన్ని అరికట్టేందుకు యువతే చైతన్యవంతులుగా మారి ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు నేరప్రవృత్తులు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు."మత్తు వద్దు నాన్న... జీవితంచిత్తవుతుంది కన్న" అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, వాటి నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధచూపాలని,అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కామారెడ్డి ఆర్‌టీసీ డీఎంకు వినతిపత్రం

-భూంపల్లి, లింగంపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి
-భూంపల్లి గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్.
-భూంపల్లి లింగంపల్లి స్టేజి వద్ద ఆర్టీసీ బస్సు ఆపాలి.
-ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.
-గాంధారి లింగంపల్లి భూంపల్లి టు కామారెడ్డి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.



**గాంధారి -జూన్ 22 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం భూంపల్లి లింగంపల్లి గ్రామాల వద్ద బస్సులు ఆపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ తో కలిసి మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు సోమవారం కామారెడ్డి డిపో మేనేజర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. గాంధారి-లింగంపల్లి భూంపల్లి- కామారెడ్డి వరకు ఆర్టిసి బస్సు నడపాలని ఆర్టీసీ డిఎం కోరారు ఆయన స్థానిక స్థానికంగా స్పందించి గాంధారి నుండి లింగంపల్లి భూంపల్లి కామారెడ్డి వరకు ఆర్టీసీ బస్సు నడిచే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చాడు. ఫ్రీ బస్సులు అందుబాటులోకి వచ్చిన తర్వాత కామారెడ్డి బాన్సువాడ మధ్యలో ఎక్స్ ప్రెస్ బస్సులు ఎక్కువగా నడపడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ఆర్డినరీ బస్సులు నడిపి భూంపల్లి, లింగంపల్లి. జనగాం. గ్రామాల ప్రజలకు అటు బాన్సువాడ ఇటు కామారెడ్డికి ప్రయాణికులు వెళ్లడానికి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి నుండి బాన్సువాడ కు గతంలో 10 ఆర్డినరీ బస్సులు నడిచేయని ప్రస్తుతం నాలుగు మాత్రమే నడుపుతూ మిగతా ఎక్స్ప్రెస్ బస్సులు నడిపి ప్రజల ఇబ్బందులు పాలు చేస్తున్నారని డిఎం దృష్టికి తెచ్చారు. కొత్త బస్సులు వస్తే ఆ రూట్ లో ఆర్డినరీ బస్సు సౌకర్యం కల్పిస్తామని డిపో మేనేజర్ దినేష్ అన్నారు. వీరితోపాటు డిపో మేనేజర్ కలిసిన వారిలో విట్టల్ రావు, దత్తురావు, కిషన్ రావు, తో పాటు పలువురు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా సరుకు అందుబాటులో

**గాంధారి జూన్ 22 (మహా ప్రభ)**
గాంధారి మండల రైతులకు ముఖ్య ప్రకటన గాంధారి మండల రైతులకు తెలియజేయునది ఏమనగా, రేపు ఉదయం 6:00 గంటలకు యూరియా బుకింగ్ ప్రారంభమవుతుంది.
పిఎసిఎస్ గాంధారి గ్రామానికి సంబంధించిన యూరియా 1332 బ్యాగ్,
మాతుసాంగెం బ్రాంచ్ 888 బ్యాగ్,
పిఎసిఎస్ దుర్గం 777 బ్యాగ్స్
పిఎసిఎస్ గండివేట్ 888 బ్యాగ్స్ ,
ఏసీఎస్ ముదోల్ 1005బ్యాగ్స్ ,
పాండురంగ ట్రేడర్ గాంధారి 500 బ్యాగ్స్,
కనకమహాలక్ష్మి గాంధారి 445బ్యాగ్స్,
మౌనిక ట్రేడర్ గాంధారి 444 బ్యాగ్స్,
తిరుమల ఫెర్టిలిజెర్స్ పోతంగల్ 900 బ్యాగ్స్,
బాలాజీ ట్రేడర్ పోతంగల్ కలాల్ 450 బ్యాగ్స్
మొత్తం కలిపి 7629 బ్యాగులు....గాంధారి అన్ని సొసైటీ కేంద్రంలలో అందుబాటులో ఉంటుంది.



కావున రైతులు అవసరమైన మేరకు మాత్రమే బుకింగ్ చేసుకొని, బుకింగ్ ఐడి, ఆధార్ కార్డు మరియు పట్టాదారు పాస్‌బుక్‌తో సంబంధిత కేంద్రానికి వచ్చి యూరియాను పొందగలరు. రైతులు అనవసర ఆందోళనకు గురికాకుండా, అధికారులకు సహకరించగలరు. మళ్ళీ మనకు సరిపడా యూరియా రావడం జరుగుతుంది కాబట్టి రైతులు బుకింగ్ కాలేదు అని ఆందోళన చెందవద్దు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులు 48 గంటల వరకు యూరియా తీసుకోవడానికి అవకాశం కలదు.కావున రైతులు గాబర పడకుండా నిదానంగా తీసుకోగలరు ఒకవేళ ఎవరైనా 48 గంటలలోపు యూరియా తీసుకోకపోతే వారికి ఐడి డిలీట్ అయిన తదుపరి రోజు నుండి యూరియా బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

## ఈనెల 25న షాబాద్ గిరిజన తాండాలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు




**మెదక్ జిల్లా -22జూన్.(మహాప్రభ ).** టేక్మాల్ మండల పరిధిలోని షాబాద్ గిరిజన తాండాలో ఈనెల 25 నుండి27 వరకు గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు షాబాద్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రభు,లునావత్ పవన్ నాయక్,రమావత్ సర్దార్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న(గురువారం)ఉదయం గణపతి పూజ,పుణ్యాహ వచనం,గురు ప్రార్థన,అఖండ దీపారాధన,తదితర కార్యక్రమాలు,26న(శుక్రవారం) మండప పూజలు,అన్నదివాసం, కనక దివాసం,పుష్ప దివాసం,మూల మంత్ర హోమం,మండప దేవత హోమం,తదితర కార్యక్రమాలు 27న(శనివారం)మండప పూజలు,దుర్గా భవాని,సేవాలాల్ పంచామృతం,మహాభిషేకం,యంత్ర ప్రతిష్ఠ,విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, సాయంత్రం 04.00గం.కు బోనాలు సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమానికి ఆయా గిరిజన తాండాలోనీ సేవాలాల్ భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## పాపన్నపేట చేనేత సహాకార సంఘం అధ్యక్షులుగా కొడపాక విట్టల్



**మెదక్ జిల్లా -22జూన్.(మహాప్రభ ).**
మండల కేంద్రమైన పాపన్నపేట చేనేత సహకార సంఘం సంఘానికి సోమవారం రోజు ఎన్నికలు నిర్వహించించినట్లు ఎన్నికల అధికారి,జిల్లా సహకార అధికారి కార్యాలయం (మెదక్) టి.ఉమాశంకర్ సీనియర్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.అధ్యక్షులుగా కొడపాక విట్టల్, ఉపాధ్యక్షులుగా పల్లె సంగమేశ్వర,కోశాధికారిగా అచుకట్ల గురునాధం, కార్యదర్శిగా కొడపాక వెంకటేశం, డైరెక్టర్ లుగా దాసరి యాదయ్య, చామంతుల మల్లయ్యా, చింతకుంట రంగయ్య,పల్లె లక్ష్మణ్,కొడపాక సావిత్రి లు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ విట్టల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టినందుకు చేనేత కుల సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.అన్ని విధాలుగా సంఘాన్ని,సంఘం సభ్యులను అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు.

## మెండే నరసమ్మ" దశదిన కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్




**దేవరకొండ జూన్ 22( మహా ప్రభ)**
చింతపల్లి మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ మెండే వెంకటయ్య తల్లి శ్రీమతి మెండే నరసమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెండే నరసమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, చింతపల్లి సర్పంచ్ కాసారపు శ్రీను, తీదేడు మాజీ సర్పంచ్ విజేందర్ రెడ్డి, మల్లెపల్లి సర్పంచ్ ముద్దం మల్లేష్, గడియారం గౌరారం మాజీ ఎంపీటీసీ గుణమోని కొండల్ యాదవ్, ఉప సర్పంచ్ బాలమోని దేవయ్య, ఉజ్జిని రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి చిన్నారులకు అక్షరాభ్యాసం, యూనిఫామ్‌ల పంపిణీ



**శివ్వంపేట జూన్ 22(మహాప్రభ):** శివ్వంపేట మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో స్థానిక సర్పంచ్ రాజుపేట వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అంగన్వాడి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ రాజుపేట వెంకటేశ్వర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రానికి సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. చిన్నారుల విద్యాభివృద్ధికి, సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సంతోష, అంగన్వాడి టీచర్ నవీనా, మాజీ వార్డు సభ్యులు బసంపల్లి పోచ గౌడ్, వంజరి కొండల్, కొవ్వూరి వెంకటేష్, దొడ్ల అశోక్, బిస్కుందు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.

# టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్‌కు కొత్త నాయకత్వం

-కంపెనీ అభివృద్ధే కార్మికుల అభివృద్ధికి బాట


-: ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి





**తూప్రాన్, జూన్ 22.(మహాప్రభ)**
మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం, బ్రాహ్మణపల్లి లోని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టీసీపిఎల్) కంపెనీ కార్మిక సంఘం నూతన అధ్యక్షుడిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం టీసిపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ , మేనేజ్మెంట్ ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామారెడ్డి ఎమ్మెల్యే, టీసీపిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి గారు కంపెనీ గెట్ ముందు బీఎంఎస్ జెండాను ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబంలో భార్యాభర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగినట్లే కంపెనీ యాజమాన్యం, కార్మికులు కూడా ఐక్యంగా పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందడంతో పాటు కార్మికుల జీవితాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. కంపెనీ బాగుంటేనే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని, చిన్న చిన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కంపెనీ అభివృద్ధి, కార్మికుల ఎదుగుదల ఒకదానికొకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. యాజమాన్యం, కార్మికులు పరస్పరం లాగుడుదీతలకు దిగితే సమస్యలు జటిలమై ఇరువర్గాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కార్మిక నాయకుడిగా, యూనియన్ అధ్యక్షుడిగా కార్మికుల సమస్యల పరిష్కారంలో సమర్థవంతమైన మధ్యవర్తిత్వం నిర్వహించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో అవినీతికి తాను పూర్తిగా వ్యతిరేకమని, ప్రజల డబ్బును దుర్వినియోగం చేసే వారిని సహించనని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో గత, ప్రస్తుత ముఖ్యమంత్రులపై విజయం సాధించిన ఎమ్మెల్యేగా తన బాధ్యతను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని చెప్పారు. అవసర సమయంలో అండగా నిలబడటమే నిజమైన సేవ అని, కష్టకాలంలో ఇచ్చే ధైర్యం ఎన్నో కుటుంబాలకు బలాన్నిస్తుందని పేర్కొన్నారు.
కార్మికునికి న్యాయం జరిగితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తాను పదవిని ఆడంబరంగా, అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించే వ్యక్తినని తెలిపారు. టీసీపిఎల్ మేనేజ్మెంట్, కార్మికులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతున్నందున సంస్థ మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక ఉద్యోగం పై అతని కుటుంబంలోని నల్గురు సభ్యుల జీవితం ఆధారపడి ఉంటుందని, అందుకే ప్రతి ఉద్యోగి సంక్షేమం సంస్థ పురోగతితో ముడిపడి ఉందన్నారు. ట్రేడ్ యూనియన్ వ్యవహారాలు తనకు కొత్త అయినప్పటికీ కేవలం రెండు నెలల్లోనే యూనియన్ చట్టాలు, నిబంధనలను అధ్యయనం చేసి కార్మికులు, యాజమాన్యం మధ్య వారధిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. సంస్థలోని ప్రతి సమస్యను చర్చల ద్వారా పరిష్కరించి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీసీపిఎల్ కార్మిక సంఘానికి నూతన నాయకత్వం లభించడం సంస్థలో కార్మిక-యాజమాన్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, కార్మిక సంక్షేమంతో పాటు పరిశ్రమ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసీపిఎల్ సైట్ హెడ్ శివకుమార్, హెచ్.అర్ కోటేశ్వర రావు, క్వాలిటీ ఆఫీసర్ రాకేష్, ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, మెయింటెనెన్స్ ఇన్‌చార్జి రంగనాయకులు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం. గిరీష్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి వర్గంటి రామ్‌మోహన్ గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య ముదిరాజ్, పడాలపల్లి కౌన్సిలర్ సత్యనారాయణ, సంఖ్య యాదగిరి, రఘువీరారెడ్డి, వెంకట నాగేంద్ర గౌడ్, జక్కిడి నరేందర్ రెడ్డి (బుల్లెట్ రాజు), టాటా కంజుమర్ ప్రొడక్ట్ లిమిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ లంబ లవకుమార్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ బొంది శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. నర్సింగ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. రఘుపతి రెడ్డి, టి. వీరప్రసన్న, ట్రెజరర్ బి. వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి. ప్రవీణ్, జి. సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లు కే. దైవాదీనం, ఎల్. మహేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎం.రామశర్మ, కార్మిక నాయకులు, మహిళా కార్మికులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ సికింద్లాపూర్ పాఠశాలకు జీఎంఆర్ ఫౌండేషన్ నుంచి 43 అంగుళాల ఆండ్రాయిడ్ టీవీ బహుకరణ




**శివంపేట ,జూన్ 22(మహాప్రభ):**
శివ్వంపేట మండలంలోని ఎంపీపీఎస్ సికింద్లాపూర్ పాఠశాలలో ఈరోజు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ విద్యాబోధనను ప్రోత్సహించేందుకు 43 అంగుళాల ఆండ్రాయిడ్ టీవీని పాఠశాలకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ అరుణ సురేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఏఏపీసీ చైర్‌పర్సన్ కవిత పాల్గొన్నారు. అలాగే టీవీ బహుకరణకు సహకరించిన హనుమాన్‌నగర్ హెచ్‌ఎం అరుణ, నవాబుపేట హెచ్‌ఎం బాబా, సికింద్లాపూర్ పాఠశాల హెచ్‌ఎం అనిల్ రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణమాచారి, సీఆర్పీ అంజనాయక్ తదితరులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల డిజిటల్ విద్యకు సహకరించిన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌కు పాఠశాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఈ ఆండ్రాయిడ్ టీవీ ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## తూప్రాన్ మున్సిపల్ సాధారణ సమావేశంలో అభివృద్ధి పనులకు ఆమోదం




**తూప్రాన్, జూన్ 22.(మహాప్రభ)**
తూప్రాన్ మున్సిపాలిటీలో సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ సమక్షంలో నిర్వహించారు. సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, వివిధ అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, మరమ్మతులు తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. అలాగే వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 16 వార్డుల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.
పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కొక్కొండ సమత, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్, ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్)తో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐల నుంచి ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఇద్దరు అధికారులు

-పదోన్నతి చిహ్నాలు అలంకరించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్.




**మెదక్ జిల్లా -22జూన్ (మహాప్రభ ).**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మాణిక్ ప్రభు, వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సదత్ హుసైన్ ఏఎస్ఐల నుంచి ఎస్ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాదని, ప్రజలకు మరింత బాధ్యతాయుతంగా సేవలందించే అవకాశమని అన్నారు. చట్ట పరిరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారంలో నిబద్ధతతో పనిచేస్తూ జిల్లా పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన అధికారులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తామని తెలిపారు.

## తూప్రాన్ ఎ.ఎస్.ఐ మాణిక్ ప్రభుకు ఎస్ఐగా పదోన్నతి



**మెదక్, జూన్ 22 (మహాప్రభ)**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ మాణిక్ ప్రభు, వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ సదత్ హుసైన్ ఎస్ఐలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాదని, ప్రజలకు మరింత బాధ్యతాయుతంగా సేవలందించే అవకాశం అని అన్నారు. చట్ట పరిరక్షణ, శాంతిభద్రతల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో నిబద్ధతతో పనిచేస్తూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన అధికారులు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ జూనియర్ కాలేజీల ఘనంగా ఫ్రెషర్స్ డే



**కరీంనగర్, జూన్ 22( మహాప్రభ)** అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ జూనియర్ కాలేజీలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని వారు సూచించారు.డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గత 36 సంవత్సరాలుగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసి పోటీ పరీక్షల్లో విజయాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నామని, ఈ విద్యా సంవత్సరంలో 109 మంది విద్యార్థులు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు సాధించారని తెలిపారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించగా, తల్లిదండ్రులు నరేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లపై బీఆర్ఎస్ ఫిర్యాదు



**హుస్నాబాద్, జూన్ 22( మహాప్రభ)**
ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, అడ్మిషన్లు, టీసీలు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. ఆటస్థలాలు, పార్కింగ్ సదుపాయాలు లేకపోయినా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన అన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యాస శ్రీనివాస్, కొమ్మెర నర్సింహారెడ్డి, చెన్నబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముప్పు శ్రీనివాస్ నియామకం



**హుస్నాబాద్ , జూన్ 22( మహాప్రభ)**
ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముప్పు శ్రీనివాస్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తానని ముప్పు శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## హలో ఉప సర్పంచ్--చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపు



**మానకొండూర్, జూన్ 22( మహాప్రభ)**
జూన్ 25న హైదరాబాద్‌లో జరగనున్న హలో ఉప సర్పంచ్--చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపసర్పంచుల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ ఆకు బత్తిని విజయ్ కుమార్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో ఫోరం అధ్యక్షుడు గడ్డి గణేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపసర్పంచులకు చెక్ పవర్ రద్దు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాపాక ప్రవీణ్, ఉపాధ్యక్షులు మర్రి కుమారస్వామి, ఈడుముల సంపత్, వేల్పుల కొమురయ్యతో పాటు ఆడెపు రమేష్, మేకల మహేందర్, ముడగాని అనిల్ గౌడ్, కాల్వ శ్రీనివాస్ యాదవ్, పొలవేణి రాజేష్, జిల్లెల్ల రాజు తదితర గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం



**సిద్దిపేట, జూన్ 22( మహాప్రభ)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద 99 రోజుల కార్యాచరణను విజయవంతంగా అమలు చేసిన జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రత్యేక అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ ఐఏఎస్ అభినందించారు.ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్‌తో కలిసి వివిధ శాఖల పనితీరును ఆయన సమీక్షించారు. గ్రామ, వార్డు, మండల సభల ద్వారా వచ్చిన 19 వేల ఫిర్యాదులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.సామాజిక పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంటేషన్ సిద్ధం చేసి విజయగాథలను ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిపేలా ప్రచారం కల్పించాలని సూచించారు.కార్యక్రమం ముగింపులో నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

## కొత్తగట్టులో ర్యాంప్ ఏర్పాటుకు లైన్ క్లియర్



**కరీంనగర్, జూన్ 22( మహాప్రభ)** కరీంనగర్--వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద ర్యాంప్ ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.స్థానికుల విజ్ఞప్తిపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో హైవే అధికారులు స్పందించారు. గతంలో గ్రామ ప్రజలు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి ర్యాంప్ అవసరాన్ని వివరించారు.మంత్రి ఆదేశాల మేరకు హైవే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ర్యాంప్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. దీంతో కొత్తగట్టు, పరిసర గ్రామాల ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

## ఘనంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 87వ దినోత్సవం వేడుకలు



**కరీంనగర్, జూన్ 22( మహాప్రభ)**
సుభాష్ నగర్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్బి) 87వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, కార్పొరేటర్ బొట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి, విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ, నేతాజీ ఆశయాలతో అవినీతి, అన్యాయాలకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని తెలిపారు. యువత నేతాజీ స్ఫూర్తితో సమాజంలో అసమానతలపై ప్రశ్నించి, నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యారావు, బద్రినేత, విద్యార్థి సంఘం నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్, గూడా కిష్టయ్య, రాహుల్, సజ్జు, సాగర్ బాబాన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలా సిపిఐ నిరసన




**కరీంనగర్, జూన్ 22( మహాప్రభ)** అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలా లేక సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమించుకోవాలా ప్రభుత్వం తేల్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రశ్నించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గత ప్రభుత్వ కాలంలో చింతకుంటలో నిర్మించిన 600 ఇండ్లను ఇప్పటికీ పంపిణీ చేయకపోవడం నిరుపేదలకు అన్యాయం అని ఆయన విమర్శించారు.రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇండ్లను కేటాయించకపోవడం నిర్లక్ష్యమని, తక్షణమే అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ధర్నా అనంతరం సిపిఐ నాయకులు ఆర్డిఓ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, బుచ్చన్న యాదవ్, గామినేని సత్యం, నగునూరి రమేష్, నునావత్ శ్రీనివాస్, బాకం ఆంజనేయులు, కాల్వ శ్రీనివాస్, తంగేళ్ల సదయ్య, బోయిని విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## నా బాధ ఎవరికి చెప్పాలి దేవుడా

### మద్యం మత్తులో పెట్రోల్ పోసుకొని వీరంగం



**గాంధారి-జూన్ 22 (మాహాప్రభ)**
గాంధారి మక్కల డబ్బులు పడలేదని ఓ రైతు మద్యం మత్తులో పెట్రోల్ పోసుకొని గాంధారి సొసైటీలో వీరంగం సృష్టించిన సంఘటన మండల కేంద్రంలోని సోమవారం చోటుచేసుకుంది. రైతు నా బాధ ఎవరికి చెప్పాలి దేవుడా మండల కేంద్రానికి చెందిన చిల్లల గోపాల్ గత నెలన్నర క్రితం దాదాపు 360 బస్తాలను సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. గత నెల రోజుల క్రితం విక్రయించిన రైతులకు బాకాయిలు ఖాతాలో జమఅయి తన ఖాతాలోకి సొసైటీ అధికారులు, సిబ్బంది దాదాపు రూ.3.లక్షల50 వేలు చెల్లించలేదని ఆరోపించారు. ఆవేదనతో అంతకముందె మద్యం తాగేసిన ఉన్న గోపాల్ ఓ ప్లాస్టిక్ డబ్బాలో తనవెంట తెచ్చుకున్న పెట్రోలు బుటిమీద పోసుకోవడమేకాక సొసైటీ కార్యాలయంలో చల్లి డబ్బులు చెల్లించాలంటూ నిరసనకు దిగారు. అక్కడే ఉన్న సొసైటీ డైరెక్టర్ రొడ్డ అశోక్ రెడ్డి డబ్బులు వచ్చేలా. చూస్తామని హామీ ఇస్తూ.. ఆ రైతుకు నచ్చజెప్పి శాంతింపజేశారు. సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇతడిని ఏఎస్సై ప్రకాష్ రాణాకు తీసుకెళ్లి డబ్బులు రెండు రోజుల్లో వచ్చేలా చూస్తామని నచ్చజెప్పి ఇంటికి పంపించారు.

## ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై ఆర్టీఐఎస్ఎస్ సమరభేరి


### జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్



**దేవరకొండ జూన్ 22( మహాప్రభ)**
నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రైవేట్ పాఠశాలలు సాగిస్తున్న విద్యా దోపిడీపై రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్టి పేఎస్.ఎస్.) జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం (ఆర్టి ఇ) సెక్షన్ 12(1)(Ꮻ) ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్లను మెజారిటీ ప్రైవేట్ యాజమాన్యాలు నిరాకరిస్తూ చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తున్నాయని ఆయన ఆరోపించారు. సెక్షన్ 13 నిబంధనలకు విరుద్ధంగా, కేవలం రూ.250 నుండి రూ.300 విలువ కలిగిన ఎన్సిఇఆర్ టి/ఎస్ సి. ఎస్. ఇఆర్ టి పుస్తకాలకు బదులుగా, ప్రైవేట్ పబ్లిషర్ల పుస్తకాలను రుద్ది ఒక్కో విద్యార్థి నుండి రూ.4,000ల నుండి రూ.7,000ల వరకు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. వీటికి అదనంగా యూనిఫామ్స్, బ్యాగుల పేరిట మరో రూ.2,000 నుండి రూ.3,000 దోచుకుంటున్నారని, విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఒక్కో విద్యార్థి నుండి అక్రమంగా రూ.10,000 నుండి రూ.15,000 వరకు అడ్వాన్స్ ఫీజులు గుంజుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఆమోదించిన అధికారిక ఫీజు వివరాలను ఏ పాఠశాల కూడా నోటీస్ బోర్డులపై ప్రదర్శించకుండా పారదర్శకతను సమాధి చేశాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విద్యా దోపిడీపై విద్యాశాఖ తక్షణమే స్పందించి, ప్రైవేట్ పాఠశాలల గత నాలుగు సంవత్సరాల (2022--26) రికార్డులను వెంటనే సీజ్ చేసి "4 సంవత్సరాల సమగ్ర ఆడిట్" నిర్వహించాలని బాబురామ్ నాయక్ డిమాండ్ చేశారు. పాఠశాలల్లోని విద్యార్థుల అధికారిక నమోదు రిజిస్టర్, ఎన్.సి ఇఆర్ టి/ ఎస్.సి. ఇఆర్ టి పుస్తకాల కొనుగోలు బిల్లులు, జీఎస్టీ ) ఇన్వాయిసులు, ఫీజు బోర్డులు మరియు బ్యాంకు లావాదేవీల రికార్డులను కూలంకషంగా తనిఖీ చేయాలన్నారు. ఒకవేళ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు, వారు కొనుగోలు చేసిన ప్రభుత్వ పుస్తకాల బిల్లులకు తేడాలు వస్తే... సదరు పాఠశాల గుర్తింపును రద్దు చేయడమే కాకుండా, యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో స్థానిక ఎంఈఓ ( ఎం.ఇ. బ), డీఈఓ )లు తక్షణమే స్పందించి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యంపై రాష్ట్ర విజిలెన్స్, కేంద్ర విజిలెన్స్ మరియు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్.సి.పి.సి.ఆర్)లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ దోపిడీపై విద్యాశాఖ కమిషనర్‌కు నేరుగా నివేదిక సమర్పించి, బాధ్యులకు శిక్ష పడేవరకు ఆర్టీఐఎస్ఎస్ (ఆర్. టి ఐ విఎస్ఎస్. ) తరఫున చట్టపరమైన న్యాయ పోరాటం కొనసాగిస్తామని కేతావత్ బాబురామ్ నాయక్ స్పష్టం చేశారు.

# బిజినెస్

## ప్రపంచవ్యాప్తంగా 'ఎక్స్' సేవలకు అంతరాయం



ప్రముఖ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (మాజీ ట్విట్టర్) సేవలకు ప్రపంచవ్యాప్తంగా సోమవారం అంతరాయం ఏర్పడింది. వేలాది మంది వినియోగదారులు యాప్, వెబ్‌సైట్ పనిచేయడం లేదని, పోస్టులు లోడ్ కావడం లేదని, సందేశాలు పంపడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదు చేశారు. అమెరికా, యూరప్, ఆసియా, భారతదేశంలోని వినియోగదారులు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. వ్యాపార, మీడియా సంస్థలు కూడా ప్రభావితమయ్యాయి. సాంకేతిక లోపం లేదా సర్వర్ సమస్య కారణంగా ఈ అంతరాయం ఏర్పడి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

## బంగారం ధరలు మరోసారి ఢమాల్..

**రేట్లలో ఊహించని మార్పులు.. ప్రస్తుతం తులం ఎంతంటే..?**



బంగారం కొనుగోలు చేసేవారికి భారీ ఊరట. గోల్డ్ రేట్లు స్వల్పంగా పడిపోయాయి. ఇరాన్-అమెరికా శాంతి ఒప్పందంపై సంతకాలు చేశాక గోల్డ్ రేట్లు డౌన్ అవుతున్నాయి. గత వారంలో భారీగా కుప్పకూలగా.. ఈ వారం ప్రారంభంలో కూడా కుప్పకూలాయి. సోమవారం పసిడి ధరలు స్వల్పంగా పతనమయ్యాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతున్నట్లు ప్రకటించడంతో బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ మొదలైన క్రమంలో ధరలు తగ్గడంతో కొనుగోలుదారులు ఎగిరి గంతేస్తున్నారు. సోమవారం దేశంలోని వివిధ ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఒకసారి చూద్దాం.

బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..?

-దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,070 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,33,890 దగ్గర ట్రేడవుతోంది.

-హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,070గా ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,33,890గా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,360 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,35,990గా ఉంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,070గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,33,890 వద్ద ట్రేడవుతోంది.

-దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,220 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,34,040 వద్ద ట్రేడవుతోంది

-ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,070 వద్ద ట్రేడవుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,33,890గా ఉంది.

సిల్వర్ రేట్లు ఎలా..?

-ముంబైలో కేజీ సిల్వర్ ధర రూ.2,49,900 వద్ద కొనసాగుతోంది

-హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,54,900గా ఉంది

-చెన్నైలో కేజీ సిల్వర్ ధర రూ.2,54,900 వద్ద ట్రేడవుతోంది

-బెంగళూరులో కేజీ వెండి ధర రూ.2,49,900 వద్ద కొనసాగుతోంది.

## వాట్సాప్ గ్లోబల్ సీఈవోగా కునాల్ షా..!



మెసేజింగ్ యాప్ వాట్సాప్ గ్లోబల్ సీఈవోగా భారత ఆంత్రోప్రెన్యూర్ కునాల్ షా బాధ్యతలు చేపట్టనున్నాడు. 'క్రెడ్' యాప్ వ్యవస్థాపకుడైన కునాల్‌ను తదుపరి సీఈవోగా నియమిస్తున్నట్లు సోమవారం మెటా సంస్థ ప్రకటించింది. 2019 నుంచి సేవలందిస్తున్న విల్ కథ్‌కార్ట్ వారసుడిగా కునాల్ త్వరలోనే వాట్సాప్ పగ్గాలు అందుకోనున్నాడు.ఆంత్రోప్రెన్యూర్‌గా విజయవంతమైన, సాంకేతికగ అనుభవం కలిగిన కునాల్ అసవరం వాట్సాప్ యాప్‌కి ఎంతో ఉందని మెటా భావించింది. కునాల్ టెక్నికల్ నాలెడ్జిని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మెచ్చుకున్నారు కూడా. అందుకే.. అన్ని విధాలా సమర్థుడైన కునాల్‌ను తదుపరి గ్లోబల్ సీఈఓగా నియమించింది.వాట్సాప్ తుదపరి నాయకుడిగా కునాల్ షా మెటాలో భాగమవ్వనున్నాడు. భారత దేశంలో ముఖ్యమైన సాంకేతిక కంపెనీగా క్రెడ్‌ను అతడు తీర్చిదిద్దాడు. సాంకేతిక నైపుణ్యం, యూజర్ల నాడీ బాగా తెలిసిన కునాల్.. ప్రపంచంలోనే పెద్దదైన మెసేజింగ్ యాప్‌ను మరింత మెరుగ్గా నడుపనున్నాడు. కునాల్‌తో కలిసి పనిచేసేందుకు.. కోట్లాది మందికి వాట్సాప్ సేవల్ని ఉత్తమంగా అందించేందుకు నేను ఎదురుచూస్తున్నా అని జుకర్ బర్గ్ పేర్కొన్నాడు. సాంకేతికపై కునాల్‌కు మెరుగైన అవగాహన ఉండడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు వాట్సాప్ ఎంతలా ఉపయోగపడుతుంది అనే విషయంలో కునాల్‌కు ఉన్న ఆలోచనలు అతడిని తదుపరి సీఈవోగా ఎంపికయ్యేలా చేశాయి అని మెటా చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ క్రిస్ కాక్స్ వెల్లడించాడు. ప్రస్తుతానికి ప్రపంచవ్యాప్తంగా మూడొందల కోట్ల మంది యూజర్లు వాట్సాప్‌ను వినియోగిస్తున్నారు. అలానే వాట్సాప్ ద్వారా నగదు చెల్లింపులు కూడా చేస్తున్నారు. డ్రీమ్‌ప్లగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన క్రెడ్ యాప్ వ్యవస్థాపకుడైన కునాల్ షాకు సాంకేతికతపై మంచి పట్టుంది. క్రెడ్‌తో పాపులరైన అతడికి నిజజీవితంలో ప్రజలు వాట్సాప్‌ను ఎలా ఉపయోగిస్తున్నారు? అనేది బాగా తెలుసు. పైగా భారత్‌లోనే వాట్సాప్ యూజర్లు ఎక్కువ.

## కోహ్లీ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇస్తాడా..?



స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన టెస్ట్ క్రికెట్ రీఎంట్రీ వార్తలకు పూర్తిగా తెరదించాడు. తన వన్8 బ్రాండ్ షూ లాంచ్ ఈవెంట్‌లో హోస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. టెస్ట్ క్రికెట్‌తో తన పని అయిపోయిందని స్పష్టం చేశాడు. కోహ్లీ తన టెస్ట్ కెరీర్‌లో చేసిన మొత్తం పరుగులు 9,230 కాగా, దానికి గుర్తుగా కొత్త షూ ధరను కూడా రూ. 9,230 గానే నిర్ణయించడం విశేషం. ప్రస్తుతం కోహ్లీ దృష్టి కేవలం వన్డే ఫార్మాట్ పైనే ఉంది. విరాట్ కోహ్లీ .. ప్రపంచ క్రికెట్‌లో పరిచయం అక్కర్లేని పేరు. ఎన్నో రికార్డులు అతడి సొంతం. ఛేజ్ మాస్టర్‌గా పేరుపొందిన విరాట్ కోహ్లీ.. భారత్‌కు ఎన్నో అపురూప విజయాలు అందించాడు. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు బద్దలు కొట్టాడు. అయితే ప్రస్తుతం కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే టీ20, టెస్టులకు గుడ్ బై చెప్పేశాడు కోహ్లీ. కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ 2027 కోహ్లీ కెరీర్‌లో చివరి ఈవెంట్ అయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇటీవల కొన్ని వార్తలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. టెస్ట్ క్రికెట్‌కే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కింగ్.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని మళ్లీ రీఎంట్రీ ఇస్తాడనే వార్తలు వస్తున్నాయి. అభిమానులు కూడా ఈ వార్తలు నిజం కావాలని కోరుకుంటున్నారు. అతడిలో ఇంకా క్రికెట్ ఉందని.. టెస్ట్ క్రికెట్‌కు అతడి అవసరం ఉందని పేర్కొంటున్నారు. అయితే ఇదే విషయంపై ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీకి ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. ఇటీవల కోహ్లీ స్పోర్ట్స్ బ్రాడ్ వన్8 లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఈ బ్రాండ్‌లో ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ సాధించిన పరుగులు సైతం 9,230 కావడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ హోస్ట్.. కోహ్లీని ఉద్దేశించి ఓ ప్రశ్న అడిగాడు. "విరాట్ మీరు ఇంకొన్ని రన్స్ చేసి.. ఆ షూ లాభాలు పెంచొచ్చు కదా?" అని అడిగాడు. దీనికి కోహ్లీ "నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతా. మీరు ఏదైతే అడుగుతున్నారో దానితో.. (టెస్ట్ క్రికెట్‌ను ఉద్దేశిస్తూ.. ) నా పని అయిపోయింది. థాంక్యూ" అని విరాట్ కోహ్లీ సమాధానమిచ్చాడు. కోహ్లీ సమాధానంతో అతడు మళ్లీ టెస్ట్ క్రికెట్‌లో ఆడబోడనే విషయం స్పష్టమైంది. కోహ్లీ.. త్వరలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది.

....................


## ఓడినా భారత్‌కు ఛాన్స్...!



మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడినప్పటికీ, భారత్ o2.511 అత్యుత్తమ నెట్ రన్ రేట్‌తో గ్రూప్-ఏ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. అయితే సెమీస్ చేరాలంటే జూన్ 25న బంగ్లాదేశ్, జూన్ 28న ఆస్ట్రేలియాతో జరిగే తదుపరి రెండు మ్యాచ్‌లలో భారత్ తప్పక గెలవాలి. ఒకవేళ భారత్ ఒక మ్యాచ్ ఓడిపోతే, సెమీస్ అవకాశాలు సంక్లిష్టం అవుతాయి. అప్పుడు దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితాలపై టీమిండియా సెమీస్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టుకు షాక్ తగిలింది. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచులో దక్షిణాఫ్రికా.. భారత్‌పై విజయం సాధించింది. తాజా విజయంతో సౌతాఫ్రికా తమ సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. కానీ ఈ మ్యాచ్ ఫలితంతో టీమిండియా సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఈ టోర్నీలో భారత్, సౌతాఫ్రికా గ్రూప్-ఏలో ఉన్నాయి. పాయింట్స్ టేబుల్‌లో ఇప్పుడు ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్, సౌతాఫ్రికాల్లో కేవలం ఒక్క జట్టు మాత్రమే సెమీస్ చేరే అవకాశం ఉంది. భారత్ ఈ టోర్నీలో మిగిలిన లీగ్ స్టేజ్‌లో జూన్ 25న బంగ్లాదేశ్, జూన్ 28న ఆస్ట్రేలియాతో తలపడనుంది. సౌతాఫ్రికా చేతిలో ఓడినా.. టీమిండియా నెట్ రన్ రేట్ మెరుగ్గా ఉంది. దీంతో దక్షిణాఫ్రికాతో సమానంగా పాయింట్లు ఉన్నప్పటికీ టేబుల్‌లో భారత్ ఇప్పటికే రెండో ప్లేసులో ఉంది. ఇక టీమిండియా సెమీస్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచులలో తప్పకుండా గెలవాల్సి ఉంది. ప్రస్తుతం టీమిండియా నెట్ రన్ రేట్ 2.511, దక్షిణాఫ్రికా నెట్ రన్ రేట్ కంటే - 0.546 మెరుగ్గా ఉంది. ఒకవేళ టీమిండియా తన తదుపరి రెండు మ్యాచులలో ఒకదాంట్లో ఓడిపోతే.. సెమీస్ అవకాశాలు దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితాలపై ఆధారపడి ఉంటాయి. దక్షిణాఫ్రికా మిగిలిన రెండు మ్యాచులలో బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌తో తలపడనుంది. ఇందులో ఒక దాంట్లో ఆ జట్టు ఓడిపోతే భారత్ ముందంజ వేసే అవకాశం ఉంది. అలా కాకుండా భారత్.. ఆసీస్ చేతిలో ఓడిపోయి.. ప్రొటీస్ జట్టు రెండింట్లోనూ గెలిస్తే.. టీమిండియా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సెమీస్‌కు చేరుకుంటాయి. ఇక గ్రూప్-ఏ నుంచి పాకిస్థాన్, నెదర్లాండ్స్ ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఆ రెండు జట్లూ ఆడిన మూడు మ్యాచులలోనూ ఓడిపోయాయి. ప్రస్తుతం గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా 3 మ్యాచులలో 3 విజయాలు, o4.391 నెట్ రన్ రేట్‌తో టేబుల్ టాపర్‌గా ఉంది.

# స్పోర్ట్స్

## భారత్‌తో పొట్టి సిరీస్.. ఐర్లాండ్, ఇంగ్లండ్ స్క్వాడ్ ప్రకటన..!



వన్డే సిరీస్‌లో అఫ్గనిస్థాన్‌ను వైట్‌వాస్ చేసిన భారత జట్టుతో ఇంగ్లండ్, ఐర్లాండ్ అమీతుమీకి సిద్ధమవుతున్నాయి. స్వదేశంలో టీమిండియాతో పొట్టి సిరీస్ సమీపిస్తున్నందున ఇరు దేశాలు బోర్డులు సోమవారం తమ స్క్వాడ్‌ను ప్రకటించాయి. హ్యారీ బ్రూక్ సారథిగా ఇంగ్లండ్ వేల్స్ బోర్డు 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. ఐర్లాండ్ క్రికెట్ మాత్రం 14 మందినే తీసుకుంది. రెండు టీ20ల సిరీస్‌కు ఐరిష్ జట్టుకు లొర్కాన్ టక్కర్ కెప్టెన్‌గా వ్యవరహించనున్నాడు.స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు, వన్డే సిరీస్ గెలుచుకున్న భారత జట్టు విదేశీ పర్యటనలతో బిజీ కానుంది. జూన్ 26న ఐర్లాండ్‌తో.. ఆపై జూలై 1 నుంచి ఇంగండ్ జట్టుతో టీ20 సిరీస్‌లో తలపడనుంది టీమిండియా. ఈ నేపథ్యంలో ఐర్లాండ్ క్రికెట్ సోమవారం లొర్కాన్ టక్నర్ కెప్టెన్‌గా 14 మందితో నిండిన స్క్వాడ్‌ను ఎంపిక చేసింది.ఇంగ్లండ్ వేల్స్ బోర్డు సైతం హ్యారీ బ్రూక్ సారథిగా 17 మందిని తీసుకుంది. ఓపెనర్ బెన్ డకెట్‌పై వేటు పడగా.. సకీబ్ మహమూద్, జోర్డన్ కాక్స్, బేకర్ తిరిగి స్క్వాడ్‌లోకి రాగా.. జేమ్స్ కొలెస్ తొలిసారి టీ20లకు ఎంపికయ్యాడు. భారత్, ఐర్లాండ్ మధ్య జూన్ 26 శుక్రవారం తొలి టీ20 జరుగనుంది. ఆదివారం జూన్ 28న రెండో మ్యాచ్ ఉంటుంది. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది టీమిండియా. జూలై 1 నుంచి ఇరుజట్ల మధ్య పొట్టి సంగ్రామం మొదలవ్వనుంది. అనంతరం వన్డే సిరీస్ కూడా ఉండనుంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలో శ్రేయస్ అయ్యర్ సారథిగా, తిలక్ వర్మ డిప్యూటీగా వ్యహరించనుండగా.. యువకెరటం వైభవ్ సూర్యవంశీ, ఐపీఎల్ స్టార్ పేసర్ ప్రిన్స్ యాదవ్‌లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది.

**ఇంగ్లండ్ టీ20 స్క్వాడ్ :** జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, టామ్ బ్యాంటన్, జాకబ్ బెథెల్ హ్యారీ బ్రూక్(కెప్టెన్), సామ్ కరన్, విల్ జాక్స్, లియాం డాసన్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్, సకీబ్ మహమూద్, రెహాన్ అహ్మద్, జేమ్స్ కొలెస్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, జోర్డన్ కాక్స్,

**ఐర్లాండ్ టీ20 స్క్వాడ్ :** లొర్కాన్ టక్నర్(కెప్టెన్), స్టీఫెన్ డొహెనీ, జై మూంద్రా, రాస్ అడైర్, మాథ్యూ హంఫ్రెస్, హ్యారీ టెక్టర్, బెన్ కాలిట్జ్, గవిన్ హెయే, టిమ్ టెక్టర్, గరెత్ డెలానీ, మాథ్యూ హెులార్డ్, రూబెన్ విల్సన్, జార్జ్ డాక్రెల్, లియాం మెక్‌కార్తీ.

# బాక్సాఫీస్ వద్ద కాక్‌టెయిల్-2 సంచలనం

### భారీ వసూళ్లు రాబడుతున్న మూవీ




బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ మూవీగా థియేటర్లలోకి వచ్చింది 'కాక్‌టెయిల్ 2'. షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ జంటగా హోమీ అదాజానియా దర్శకత్వంలో వచ్చిన కాక్‌టెయిల్ బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. మొదటి వీకెండ్‌లోనే ఈ సినిమా ఇండియా వ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. మూడు రోజుల్లోనే మంచి హోల్డ్ సాధించి ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ఈ సినిమా బాక్సాఫీస్ ప్రయాణాన్ని గమనిస్తే.. మొదటి రోజు నుంచే సాలిడ్ కలెక్షన్లు నమోదయ్యాయి. మొదటి రోజు రూ. 115.39 కోట్లు, రెండవ రోజు రూ. 19.25 కోట్లు, మూడవ రోజు ఆదివారం రూ. 20.22 కోట్లు రాబట్టి సూపర్ స్ట్రాంగ్ గా హోల్డ్ చేసింది. మొత్తంగా చూసుకుంటే మూడు రోజుల మొదటి వీకెండ్‌లో 'కాక్‌టెయిల్ 2' ఆల్ ఇండియా ట్రాక్డ్ గ్రాస్ కలెక్షన్స్ రూ. 54.86 కోట్లకు అటు ఇటుగా నమోదు చేసింది. సీక్వెల్ హైప్ కు తోడు మౌత్ టాక్ బాగుండటంతో సాలిడ్ కలెక్షన్స్ రాబట్టింది. బాలీవుడ్ బాక్సాఫీస్ పరంగా ఇదొక అద్భుతమైన వీకెండ్ ఓపెనింగ్ అని చెప్పొచ్చు. అయితే పోటీలో మరే ఇతర సినిమాలు లేకపోవడం ఈ సినిమా రన్ కు కాస్త కలిసొచ్చే అంశం. మరి వీక్‌డేస్‌లో ఈ సినిమా ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి. రూ. 150కోట్లతో తెరకెక్కిన కాక్‌టెయిల్ 2 ఫైనల్ రన్ లో ఎంత సాధిస్తుందో చూడాలి.

# బాలకృష్ణ- కొరటాల కాంబో

### 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం




బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# చిరంజీవి మెగా 158 నయా షెడ్యూల్ షురూ..

### ఇంతకీ ఎక్కడో తెలుసా..?




టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎప్పుడెప్పుడా అనిఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటి డైరెక్టర్ బాబీ (కేఎస్ రవీంద్ర) తో చేస్తున్నమెగా 158 (వీవస్త్రు 158). వాల్తేరు వీరయ్య తర్వాత ఈ ఇద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే “ది స్పిరిట్ ఆఫ్ మెగా 158” పేరుతో రిలీజ్ చేసిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇటీవలే మెగా 158 పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తవగా.. సెట్స్‌లో చిరు అండ్ టీం దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి.తాజాగా బాబీ టీం ఆసక్తికర వార్తను షేర్ చేసుకుంది. ఈ మూవీ సెకండ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో షురూ అయింది. చిరుపై వచ్చే ప్రతీ షాట్ అద్భుతంగా ఉండబోతుందని.. ప్రతీ సన్నివేశం వేడుకగా జరుపుకునేలా ఉంటుందని తెలియజేస్తూ ఓ వీడియో షేర్ చేశారు మేకర్స్. ఈ షెడ్యూల్‌లో నివేదా పేతురాజ్, అనస్వర రాజన్‌తోపాటు పలు కీలక నటీనటులపై వచ్చే సన్నివేశాలను షూట్ చేస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ మూవీలో నివేదా పేతురాజ్, అనస్వర రాజన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. బాబీ గత సినిమాల్లో చూపించిన మాస్ ఎలిమెంట్స్, చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్‌తో మరో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతుందని భావిస్తున్నారు మూవీ లవర్స్. బ్లడీ బెంచ్‌మార్క్ మూవీగా వస్తోందంటూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నారు చిరు-బాబీ.

# నాతో నేను గడిపేందుకే ఈ నిర్ణయం



యువతలో మంచి క్రేజ్ ఉన్న కథానాయికల్లో కయాదు లోహర్ ఒకరు. ప్రస్తుతం తెలుగు, తమిళ సినిమాలతో ఈ అందాలభామ బిజీబిజీగా ఉన్నది. తాజాగా ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాకు కొన్నాళ్లు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని జత చేసింది. 'సోషల్‌మీడియా నుంచి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. శరీరం మాదిరిగానే మనసుకు కూడా విశ్రాంతి అవసరం.నాతో నేను ఎక్కువగా గడిపేందుకు తీసుకున్న నిర్ణయం ఇది. ఇప్పటిదాకా సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు. మళ్లీ కలవాలని అనిపిస్తే తప్పకుండా కలుస్తా' అంటూ రాసుకొచ్చింది కయాదు లోహర్. సో.. కొన్నాళ్లపాటు ఈ యంగ్ బ్యూటీ సోషల్ మీడియాలో ఉండదన్నమాట. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్'లో కయాదు కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# ప్రేక్షకుల దృక్కోణం మారింది అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా: సాయిదుర్గా తేజ్



సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.

# రామ్ పోతినేని-భాగ్యశ్రీ బోర్సే నిజంగా ప్రేమలో ఉన్నారా..

### పెళ్లి రూమర్స్‌కు ఊతమిచ్చిన కామెంట్స్!



సినీ పరిశ్రమలో హీరో హీరోయిన్ల మధ్య స్నేహం, ప్రేమ, పెళ్లి వార్తలు ఎప్పుడూ ఆసక్తికర చర్చలకు దారి తీస్తుంటాయి. కొన్నిసార్లు ఇవి కేవలం పుకార్లుగానే మిగిలిపోతే, మరికొన్ని సందర్భాల్లో నిజమై వివాహ బంధంగా మారుతుంటాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఇలాంటి మరో లవ్ స్టోరీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ప్రేమలో ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన భాగ్యశ్రీ బోర్సే, తన అందం, గ్లామర్‌తో యువతను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఆమె రామ్ పోతినేని సరసన 'ఆంధ్రా కింగ్' చిత్రంలో నటించే అవకాశం దక్కించుకుంది.ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, షూటింగ్ సమయంలోనే రామ్-భాగ్యశ్రీ మధ్య మంచి స్నేహం ఏర్పడిందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరిగింది. ఆ స్నేహమే క్రమంగా ప్రేమగా మారిందనే వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల తన తాజా చిత్రం 'లెనిన్' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ టాక్ షోలో భాగ్యశ్రీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారాయి. నా మొదటి ఇల్లు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ అయితే, హైదరాబాద్ నా రెండో ఇల్లు. అది ఇప్పటికే ఫిక్స్ అయిపోయింది అని ఆమె చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ఈ వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని పలువురు నెటిజన్లు, అభిమానులు భాగ్యశ్రీ త్వరలో తెలుగింటి కోడలిగా మారబోతుందా? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. కొందరు అభిమానులు అయితే రామ్‌తో ఆమె సంబంధం నిజమేనని సోషల్ మీడియాలో పోస్టులు కూడా చేస్తున్నారు. అయితే గతంలో ఈ ప్రేమ వార్తలపై రామ్ పోతినేని ఇప్పటికే స్పందించారు. తమ మధ్య ఎలాంటి ప్రేమ సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.నేను పాట రాసే సమయానికి హీరోయిన్ ఎంపికే జరగలేదు. అలాంటప్పుడు ఇప్పటివరకు చూడని అమ్మాయి కోసం నేను పాట ఎలా రాస్తాను? అంటూ రామ్ స్పందించాడు. అలాగే ప్రస్తుతం తన దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉందని, ప్రేమ లేదా పెళ్లి గురించి ఆలోచించడం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వినిపిస్తున్న ఈ వార్తలకు సంబంధించి రామ్ పోతినేని లేదా భాగ్యశ్రీ బోర్సే నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇద్దరూ తమ కెరీర్‌లతో బిజీగా ఉన్నారు. అయితే భాగ్యశ్రీ చేసిన వ్యాఖ్యలు, వీరిద్దరిపై గతంలో వచ్చిన రూమర్లు మళ్లీ చర్చకు రావడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. నిజంగా వీరిద్దరి మధ్య ప్రేమ ఉందా? లేక ఇవన్నీ కేవలం పుకార్లేనా? అన్నది భవిష్యత్తులోనే తేలనుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com